# ప్రజా మంటలు
## తెలంగాణ జాతీయ దినపత్రిక
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు








ప్రచురణ : జగిత్యాల   సంపుటి : 06   సంచిక : 03   ఆదివారం   23 - 08 - 2026   పేజీలు : 04   వెల రూ. 2


### లండన్ కేంబ్రిడ్జ్ వర్సిటీని సందర్శించిన
# సీఎం రేవంత్‌రెడ్డి బృందం

- కేంబ్రిడ్జ్ వర్సిటీని సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి
- విద్య, పరిశోధనల్లో భాగస్వామ్యంపై చర్చ
- విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్యంపై కేంబ్రిడ్జ్ ప్రతినిధులతో చర్చ
- హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు పెట్టాలని కోరిన సీఎం బృందం



**హైదరాబాద్ :**

లండన్‌లోని ప్రఖ్యాత కేంబ్రిడ్జ్ వర్సిటీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం సందర్శించింది. విద్య, పరిశోధన రంగాల్లో భాగసావ్యమ్యంపై కేంబ్రిడ్జ్ ప్రతినిధులతో సీఎం చర్చించారు. హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రొగ్రామ్‌లు పెట్టాలని కోరారు. యువపారిశ్రామికవేత్తలకు ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పష్టమైన కార్యచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని ఇరువర్గాలు నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు రామకృష్ణారావు, ప్రత్యేక సీఎస్ జయేశ్ రంజన్‌లు హాజరయ్యారు. మరోవైపు సీఎం రేవంత్ పర్యటనకు కేంద్రం నో చెప్పడాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుపట్టారు.లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు లండన్‌లోని లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగం ఆసక్తి చూపింది. భాగస్వామ్య ఒప్పందం చేసుకునేందుకు లివర్‌పూల్ ప్రతినిధి బృందం అక్టోబర్‌లో హైదరాబాద్ రానుంది. లండన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇవాళ లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగానికి చెందిన సుసాన్ ఫిన్నెగాన్, నూలా గల్లాఘర్, లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్‌కు చెందిన పలువురు - మిగతా 2 లో



# అక్రమ భవనాలన్నీ కూల్చేస్తాం

- హైడ్రా కమిషనర్
- గచ్చిబౌలిలో ఏడంతస్తుల భవనం కూలి ఇద్దరి మృతి
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన కమిషనర్ రంగనాథ్
- అంజయ్యనగర్‌లోని అక్రమ కట్టడాలన్నింటినీ కూల్చేస్తామని ప్రకటన
- సెట్‌బ్యాక్‌లు లేని భవనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని వెల్లడి

**హైదరాబాద్ :**

హైదరాబాద్ గచ్చిబౌలిలోని అంజయ్య నగర్‌లో ఏడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన నేపథ్యంలో 'హైడ్రా' కమిషనర్ రంగనాథ్ శనివారం ఘటనా స్థలాన్ని సందర్శించి - మిగతా 2 లో

### సీఎం రేవంత్‌రెడ్డికి కొండా సురేఖ
# క్షమాపణ చెప్పాలి



- కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు డిమాండ్
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కొండ సుష్మిత విమర్శలు
- ఆ వ్యాఖ్యలను ఖండిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- క్రమశిక్షణా కమిటీ వారిపై సరైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సభ్యుల విజ్ఞప్తి

**హైదరాబాద్ :**

సీఎం రేవంత్‌రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె సుష్మిత ఇటీవల చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చకు దారి తీశాయి. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. రేవంత్‌రెడ్డికి కొండా - మిగతా 2 లో

# కాలిఫోర్నియాలో దీపావళికి అధికారిక గుర్తింపు

- అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం
- అమెరికాలో భారతీయ పండుగకు గౌరవం.. దీపావళిని గుర్తించిన కాలిఫోర్నియా
- భారత సంతతి సభ్యులు దర్శన పటేల్, యష్ కల్రా చొరవతో తీర్మానానికి రూపకల్పన
- ప్రవాస భారతీయులకు, వారి సంస్కృతికి ఇది గొప్ప గౌరవమని హర్షం
- హిందూ, సిక్కు, బౌద్ధ, జైన సమాజాలకు దీపావళి ప్రాముఖ్యతను తీర్మానంలో ప్రస్తావన



**ఢిల్లీ :**

అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో దీపావళి పండుగకు అధికారిక గుర్తింపు లభించింది. ఈ మేరకు కాలిఫోర్నియా రాష్ట్ర అసెంబ్లీ ఒక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. కాలిఫోర్నియా రాష్ట్రంలోనూ, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రవాస భారతీయులు, - మిగతా 2 లో

# 48 మందికి జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలు



- సెప్టెంబర్ 5న ప్రదానం చేయనున్న రాష్ట్రపతి
- అవార్డు గ్రహీతల జాబితాలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఉపాధ్యాయులు
- సెప్టెంబర్ 5న దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో పురస్కారాలను ప్రదానం చేయనున్న రాష్ట్రపతి

**ఢిల్లీ :**

పాఠశాల విద్య, అక్షరాస్యతకు చేసిన సేవలకు గుర్తింపుగా 48 మంది ఉపాధ్యాయులకు ప్రభుత్వం శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ అవార్డులు 2026ను ప్రకటించింది. అవార్డు గ్రహీతల జాబితాలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఉపాధ్యాయులతో పాటు కేంద్రీయ విద్యాలయ - మిగతా 2 లో

# విశాఖ వేదికగా బ్రిక్స్ దేశాల సదస్సు



- తోట్లకొండను సందర్శించిన బ్రిక్స్ ప్రతినిధులు
- భారత్ అధ్యక్షతన విశాఖలో బ్రిక్స్ యువజన, క్రీడా మంత్రుల సమావేశాలు
- మొత్తం 11 సభ్య దేశాల ప్రతినిధుల హాజరు
- యువజన సాధికారత, క్రీడల్లో సహకారంపై ప్రధానంగా చర్చ
- ఏపీ సీఎం చంద్రబాబుతోనూ భేటీ కానున్న ప్రతినిధులు

**అమరావతి :**

భారత్ అధ్యక్షతన జరుగుతున్న 2026 బ్రిక్స్ సదస్సులో భాగంగా సాగర నగరం విశాఖపట్నం కీలక సమావేశాలకు ఆతిథ్యం ఇస్తోంది. ఇవాళ, రేపు తేదీల్లో బ్రిక్స్ యువజన వ్యవహారాల మంత్రుల సమావేశం, క్రీడా మంత్రుల సమావేశం ఇక్కడ జరుగుతున్నాయి. బ్రెజిల్, చైనా, ఈజిప్ట్, - మిగతా 2 లో



2 లో

# సెప్టెంబర్ 1 నుంచి విమానాశ్రయాల్లో కొత్త రూల్

- ఇకపై అంతా డిజిటల్!
- ఇమ్మిగ్రేషన్ కౌంటర్ల వద్ద ఫిజికల్ బోర్డింగ్ పాస్ తప్పనిసరి కాదు
- డిజిటల్ లేదా ఈ-బోర్డింగ్ పాస్‌తోనే క్లియరెన్స్ పొందవచ్చు
- బోర్డింగ్ పాస్‌పై స్టాంపింగ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసిన ప్రభుత్వం
- దేశంలోని అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో మార్పులు అమలు



2 లో

# ఫ్రాన్స్‌లో తొలి హిందూ ఆలయం

- భారత్‌లో తయారీ, పారిస్‌లో నిర్మాణం
- ఫ్రాన్స్‌లో మొట్టమొదటి సంప్రదాయ హిందూ దేవాలయ నిర్మాణం పూర్తి
- 13 రోజుల పాటు ఘనంగా 'ఫెస్టివల్ ఆఫ్ కల్చర్' వేడుకలు

# 10,060 పోస్టులతో 'జాబ్ క్యాలెండర్ 2026' విడుదల

- నాలుగు దశల్లో ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్
- సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో రానున్న నోటిఫికేషన్లు
- ఈ మేరకు జీవో జారీ చేసిన ఆర్థికశాఖ అధికారులు
- ఏపీలో 10,060 పోస్టులతో 'జాబ్ క్యాలెండర్ 2026' విడుదల




**అమరావతి :**

రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు శుభవార్త వచ్చేసింది. కూటమి ప్రభుత్వం ఇచ్చినమాటను నిలబెట్టుకుంది. శాసనసభలో ప్రకటించినట్లుగానే జాబ్ క్యాలెండర్-2026 విడుదలకు అనువుగా ఆర్థికశాఖ 10,060 పోస్టులను నేరుగా భర్తీ చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. అభ్యర్థుల సన్నద్ధతను దృష్టిలో ఉంచుకుని నాలుగు దశల్లో ఈ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదలకు పచ్చజెండా ఊపింది. దీంతో 149 గ్రూపు-1 సర్వీసులతోపాటు ఇతర ఖాళీలు కూడా భర్తీ కానున్నాయి.ప్రభుత్వ కొలువుల కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థుల కల సాకారం కాబోతోంది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 10,060 పోస్టుల భర్తీకి ప్రభుత్వం సిద్ధమైంది. అభ్యర్థులు ఒకేసారి గందరగోళానికి గురికాకుండా వారికి సన్నద్ధమయ్యేందుకు తగిన సమయం ఇస్తూ పక్కా ప్రణాళికతో నాలుగు దశల్లో నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు ప్రకటించింది. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంగా మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం, శాంతిభద్రతల విభాగాలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చింది. జాబ్ క్యాలెండర్-2026 విడుదలకు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ జీవో నంబర్ 81 జారీ చేశారు. ఏపీపీఎస్సీ, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్, డీఎస్సీ ద్వారా ఈ పోస్టులు భర్తీ చేసేందుకు ఆర్థికశాఖ ఆమోదం తెలిపింది. నాలుగు దశల్లో ఈ నియామకాలు జరగనున్నాయని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.మొదటి దశలో ఉన్నత విద్యాశాఖకు చెందిన 1,523 పోస్టులకు - మిగతా 2 లో

### సంస్కరణలు పూర్తయ్యాయి..
# ఇక 100 శాతం ఫలితాలే లక్ష్యం

- మంత్రి నారా లోకేశ్
- విజయనగరం దాసన్నపేటలో క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం
- హాజరైన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- ప్రతినెలా క్లస్టర్ స్కూల్ సమావేశాలకు హాజరవుతానని మంత్రి హామీ
- ఈ ఏడాది మరో 3 వేల టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నిర్ణయం
- నైతిక విలువల పెంపునకు ప్రత్యేక పాఠ్యాంశాలు రూపొందించామని వెల్లడి
- ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థను దేశంలోనే నంబర్ వన్ గా నిలుపుతామని ప్రకటన



**అమరావతి :**

రాష్ట్ర విద్యా వ్యవస్థలో సంస్కరణల శకం పూర్తయిందని, ఇకపై నూరు శాతం ఫలితాలు సాధించడమే అందరి లక్ష్యం కావాలని విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విజయనగరం దాసన్నపేటలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జరిగిన క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. - మిగతా 2 లో

# నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణి





**వెల్గటూర్ ఆగస్టు 22 ( ప్రజామంటలు ) :** వెల్గటూర్ మండలం వెంకటాపూర్ గ్రామం లో శనివారం రోజున గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ బిళ్ళకూరి తిరుపతి లబ్ధిదారులకి నూతన రేషన్ స్మార్ట్ కార్డులు పంపిణీ చేయటం జరిగింది. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ అల్లం శ్రీనివాస్, పాలకవర్గం సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.నూతన రేషన్ స్మార్ట్ కార్డులు ప్రభుత్వం పంపిణి చేయటం తో ప్రజాపాలన పైన లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో ఘనంగా సైన్స్ ఫెయిర్



**కరీంనగర్, ఆగస్టు 22 (ప్రజా మంటలు):** శ్రీ సరస్వతి శిశు మందిర్ ఈ/ఎం హైస్కూల్‌లో సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని ప్రతిబింబించే వివిధ శాస్త్రీయ నమూనాలు, ప్రాజెక్టులను ప్రదర్శించారు.పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, విద్యుత్ ఆదా, పునరుత్పాదక ఇంధన వనరులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలపై విద్యార్థులు రూపొందించిన నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రతి విద్యార్థి తన ప్రాజెక్ట్ ఉపయోగం, పనిచేసే విధానం, సమాజానికి కలిగే ప్రయోజనాలను వివరించారు.పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ విద్యార్థులను అభినందిస్తూ, ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, సృజనాత్మకత, సమస్య పరిష్కార సామర్థ్యాలను పెంపొందిస్తాయని అన్నారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు భవిష్యత్‌లో మరిన్ని శాస్త్రీయ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రాజెక్టులను ఈ నెల 23, 24 తేదీల్లో సిద్దిపేటలో జరిగే విభాగ్ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించనున్నారు.సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, గట్టు శ్రీనివాస్, బొడ్ల శ్రీనివాస్, రాపర్తి శ్రీనివాస్, కొత్తూరి ముకుందం, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, పులల శ్యామ్ తదితరులు పాల్గొని విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించి వారి ప్రతిభను ప్రశంసించారు.

# 22ఏ నిషేధిత భూముల జాబితాల నుంచి భూములను తొలగించాలి

**బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నలువాల తిరుపతి**



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) ఆగస్టు 22 :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 22 ఏ నిషేధిత భూముల జాబితాలలో తప్పిదాలు జరిగినట్టు రెవెన్యూ మంత్రి అంగీకరించారని అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను బహిర్గతం చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శనివారం బీజేపీ నాయకులు జగిత్యాల జిల్లా కలెక్టర్ ను కోరారు.బిజెపి నాయకులు జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ఏవోకు వినతి పత్రం సమర్పించారు.22 ఏ జాబితాను గ్రామాల వారిగా, సర్వేనెంబర్ల వారిగా, ప్రభుత్వ అస్సైడ్ భూములను కూడా ప్రజలకు అందుబాటులో ఉంచాలని వారు కోరారు. అదేవిధంగా తప్పిదాలకు సంబంధించిన శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని నైతిక బాధిత వహించి ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నలవాల తిరుపతి, దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓరుగంటి చంద్రశేఖర్, జిల్లా కోశాధికారి సుంకేట దశరథరెడ్డి, కార్యాలయ కార్యదర్శి జుంబర్తి దివాకర్, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాగిళ్ల సత్యనారాయణ, కస్తూరి సత్యం, పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్, జగిత్యాల రూరల్ అధ్యక్షులు ఇట్నేని రమేష్,అర్బన్ అధ్యక్షులు గడ్డం రామిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కాయితి శంకర్ తదితరులు పాల్గొన్నారుద.

# వృద్ధుల సంరక్షణ చట్టం పిలుపు

**పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ ఎల్ రమణ**



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ప్రజా మంటలు, ఆగస్ట్ 22 :** తెలంగాణ అల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ముద్రించిన వృద్ధుల సంరక్షణ చట్టం పిలుపు పుస్తకాలను ఎమ్మెల్సీ ఎల్. రమణ జగిత్యాల వారి నివాసంలో ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ ఎల్ రమణ మాట్లాడుతూ సీనియర్ సిటిజెన్లకు అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.జిల్లాలో నిరాధరణకు గురవుతున్న వృద్ధ తల్లి దండ్రుల కేసుల పరిష్కారంలో సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో సంఘాల ప్రతినిధులు చేస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.సీ. హన్మంత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పూసాల అశోక్ రావు, బొల్లం విజయ్, కార్యదర్శి గౌరి శెట్టి విశ్వ నాథము, కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఎం.డీ. ఇక్బల్, కొక్కు నారాయణ, బ్రహ్మ య్య, సయ్యద్ యూసుఫ్, కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం, మెట్ పల్లి అధ్యక్షులు వొజ్జెల బుచ్చి రెడ్డి, ధర్మపురి అధ్యక్షులు కే. గంగాదర్, బి.ఆర్.ఎస్. పార్టీ నాయకులు అయిల్నేని వెంకటేశ్వర్ రావు, వొళ్ళెం మల్లేశం, గాజుల రాజేందర్, సాగి సత్యం రావు కుడిక్యాల సర్వేశ్వర్, అల్లాల దామోదర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు:**

**- మంత్రి అడ్లూరి**



**ఆదిలాబాద్, ( ప్రజా మంటలు) ఆగస్టు 22:** పేద, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గిరిజన విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు.శనివారం ఉట్నూరు బాలికల ఆశ్రమ పాఠశాలను మంత్రి సందర్శించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఐఎఫ్ ప్యానెల్‌ను ప్రారంభించిన మంత్రి, అనంతరం విద్యార్థినులకు ఏకరూప దుస్తులు, కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆశ్రమ, గురుకుల పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.విద్యార్థులకు యూనిఫాంలు, షూస్, పుస్తకాలు, పోషకాహారం తదితర సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీతో పాటు సీఆర్‌టీ సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, మౌలిక వసతులు, పోషకాహారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.ఆశ్రమ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. విద్యార్థుల ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ, నెలవారీ సమీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.ఉమ్మడి జిల్లా ఐటీడీఏ పరిధిలోని 400కు పైగా గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలల్లో సుమారు రూ.20 కోట్లతో మరమ్మతు పనులు చేపట్టినట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.అనంతరం మంత్రి, కలెక్టర్, ప్రజాప్రతినిధులు విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే బొజ్జు పటేల్, అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా హైదరాబాద్‌లో సస్టెయిన్‌ఎక్స్ 2026 సదస్సు

**హైదరాబాద్, ఆగస్టు 22 (ప్రజా మంటలు):** స్థిరమైన అభివృద్ధి, బాధ్యతాయుత నాయకత్వం, భవిష్యత్‌కు సిద్ధమైన సంస్థల నిర్మాణంపై సమగ్ర చర్చలకు వేదికగా సస్టెయిన్‌ఎక్స్ 2026 వార్షిక సదస్సు హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. తెలంగాణ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ (టీఎఫ్‌ఎంసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో ప్రభుత్వ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, సంస్థల ఉన్నతాధికారులు, నిపుణులు, సామాజిక రంగ ప్రతినిధులు పాల్గొన్నారు.సుస్థిరతను కేవలం పర్యావరణ పరిరక్షణకే పరిమితం చేయకుండా ఏఐ సాంకేతికత, సంస్థాగత నాయకత్వం, మౌలిక వసతులు, సుస్థిర కొనుగోళ్లు, భవిష్యత్ కార్యాలయాలు, ఆరోగ్య రంగం, సీఎస్ఆర్, పౌర సేవలు, సుస్థిర పర్యాటకం తదితర అంశాలపై సదస్సులో విస్తృతంగా చర్చించారు. టీఎఫ్‌ఎంసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మాథల సత్యనారాయణ స్ఫూర్తిదాయక ప్రసంగంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**జీసీసీ, ప్రొక్యూర్‌మెంట్ కాన్‌క్లేవ్‌లు**

సదస్సులో నిర్వహించిన జీసీసీ కాన్‌క్లేవ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సుస్థిర సంస్థల నిర్మాణంలో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ల (జీసీసీ) మారుతున్న పాత్రపై నిపుణులు చర్చించారు. హైదరాబాద్ మౌలిక వసతుల భవిష్యత్తు, పర్యావరణ పరిరక్షణ, అభివృద్ధిదారులను ప్రోత్సహించే విధానాలపై తెలంగాణ ప్రభుత్వ ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ (ఐటీఈసీ) శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి ప్రసంగించారు.ప్రొక్యూర్‌మెంట్ కాన్‌క్లేవ్‌లో విలువ, మౌలిక వసతుల స్థిరత్వం, సుస్థిర కొనుగోళ్లపై నిపుణులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.



**ప్రజలు, సాంకేతికత, ఆరోగ్యానికి ప్రాధాన్యం**

ప్రజలు, సాంకేతికత, ఆరోగ్యం, సామాజిక బాధ్యత అంశాలకు సదస్సులో ప్రత్యేక ప్రాధాన్యం కల్పించారు. నటుడు డాక్టర్ భద్రంతో నిర్వహించిన 'వన్ లైఫ్' సంభాషణ ప్రేక్షకులను ఆకట్టుకుంది. హెచ్‌ఆర్ కాన్‌క్లేవ్‌లో భవిష్యత్ కార్యాలయాలపై చర్చలు జరిగాయి. కిమ్స్ హాస్పిటల్స్ ప్రతినిధులతో ఆరోగ్య రంగ నాయకత్వంపై ప్రత్యేక సెషన్లు నిర్వహించారు.

**సామాజిక బాధ్యతకు పెద్దపీట**

సీఎస్ఆర్ కాన్‌క్లేవ్‌లో బాధ్యతాయుత నాయకత్వం ద్వారా బలమైన సమాజ నిర్మాణంపై చర్చించారు. సర్వేజన ఫౌండేషన్ కార్యక్రమాలపై ప్రజెంటేషన్‌తో పాటు వివిధ సామాజిక కార్యక్రమాలపై ప్రసంగాలు జరిగాయి. టీఎఫ్‌ఎంసీ కేర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సపోర్ట్ ది గర్ల్ చైల్డ్' కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.యాదాద్రి, పోచంపల్లి ప్రాంతాలను సుస్థిర పర్యాటక



కేంద్రాలుగా అభివృద్ధి చేసే అవకాశాలపై కూడా ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించారు. సాయంత్రం లాయిడ్స్‌కు చెందిన ఎలిజబెత్ ప్రత్యేక ప్రసంగం చేశారు.జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు సివిక్ ఎక్సలెన్స్ అవార్డులు ప్రదానం చేశారు. కిమ్స్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో హెల్త్‌కేర్ లీడర్‌షిప్ టాక్ నిర్వహించారు.

**సుస్థిర అభివృద్ధిపై దిశానిర్దేశం**

సాంకేతికత, సంస్థల అభివృద్ధి, సేవల నాణ్యత, బాధ్యతాయుత వృద్ధి అంశాలపై అనుదీప్ దురిశెట్టి దిశానిర్దేశం చేశారు. ముగింపు కార్యక్రమంలో వ్యాపార ప్రదర్శనలు, నెట్‌వర్కింగ్ జోన్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఫ్యూజన్ డ్యాన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.ప్రభుత్వ విధానాలు, పరిశ్రమ, సాంకేతికత, మౌలిక వసతులు, ఆరోగ్యం, సీఎస్ఆర్, పౌర సేవలు, పర్యాటకం వంటి విభిన్న రంగాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సుస్థిర ఆలోచనలను కార్యాచరణాత్మక భాగస్వామ్యాలుగా మార్చడమే సస్టెయిన్‌ఎక్స్ 2026 ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# కాళేశ్వరంపై దుష్ప్రచారం-కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి

**- కోరుట్ల ఎమ్మెల్యే డా. సంజయ్**

**కోరుట్ల / జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) ఆగస్ట్ 22:** రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా, దారుణంగా వ్యవహరిస్తుందో ప్రస్తుత నీటి పరిస్థితులే నిదర్శనమని కోరుట్ల ఎమ్మెల్యే డా. సంజయ్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి "గుంపు మేస్త్రి కాదు.. తెలంగాణ ముంపు మేస్త్రి" అని తీవ్రంగా విమర్శించారు.జగిత్యాల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ ఈసారి వర్షపాతం లోటుగా ఉండే అవకాశం ఉందని, 26 జిల్లాల్లో అతి తక్కువ వర్షపాతం నమోదయ్యే పరిస్థితి ఉందని హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలాంటి హెచ్చరికలు ఉన్నప్పటికీ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టలేదని విమర్శించారు.కాళేశ్వరంపై రాజకీయ కక్షతో తెలంగాణకు వచ్చిన నీటిని సద్వినియోగం చేసుకోకుండా కిందకు వదిలేశారని సంజయ్ ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు, ఇంజినీర్లు పదేపదే ప్రభుత్వాన్ని నిలదీసిన తర్వాతే ఆలస్యంగా కొన్ని పంపులు ఆన్ చేశారని, అప్పటికే



వరద నీరు సముద్రంలోకి వెళ్లిపోయిందని అన్నారు."చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లు.. నీళ్లు కిందకు వెళ్లిపోయిన తర్వాత పంపులు ఆన్ చేస్తున్నారు. రిజర్వాయర్లు ఖాళీగా ఉన్నాయి.. తెలంగాణకు వచ్చిన నీటి చుక్కను కూడా సద్వినియోగం చేసుకోకుండా ప్రభుత్వం ద్రోహం చేసింది" అని మండిపడ్డారు.కాళేశ్వరంపై కాంగ్రెస్ దుష్ప్రచారం సిడబ్ల్యూపిఆర్ఎస్ నివేదిక చెంపపెట్టు కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇన్నాళ్లు చేస్తున్న దుష్ప్రచారానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ సిడబ్ల్యూపిఆర్ఎస్ నివేదిక గట్టి సమాధానమని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు.మేడిగడ్డలో ఒక బ్లాక్‌లోని రెండు పియర్స్‌కు మాత్రమే సమస్య ఉన్నట్లు సిడబ్ల్యూపిఆర్ఎస్ పరిశీలనలో తేలిందని, అన్నారం, సుందిళ్లలో ఎలాంటి నిర్మాణ సమస్యలు గుర్తించలేదని, నిర్మాణ నాణ్యత బాగుందని నివేదిక స్పష్టం చేసిందన్నారు. కాంక్రీట్ నాణ్యత కూడా అత్యుత్తమంగా ఉందని నివేదిక పేర్కొన్న విషయాన్ని ఆయన తెలిపారు."కాళేశ్వరం కుప్పకూలింది.. మొత్తం ప్రాజెక్ట్ వృథా" అంటూ ఇన్నాళ్లు ప్రచారం చేసిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారు? కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం చేసినందుకు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి అని సంజయ్ డిమాండ్ చేశారు.ఈ విలేకరుల సమావేశంలో జగిత్యాల జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ దావ వసంత సురేష్, మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, అవారి శివాకేసారి బాబు, దారిశెట్టి రాజేష్,ఆయిల్నేని వెంకటేశ్వర్ రావు, అల్లాల ఆనంద్ రావు, శీలం ప్రవీణ్, గాజుల రాజేందర్, పర్వేజ్ మున్నా, మహిపాల్ రెడ్డి తుమ్మ గంగాధర్, ఆనంద్ రావు, సన్నిత్, గాజుల శ్రీనివాస్, రమేష్ రావు అల్లాల, తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# టీచర్లకు రక్షణ- విద్యార్థులకు క్రమశిక్షణ






**ఎల్కతుర్తి ఆగస్టు22: ప్రజా మంటలు :** నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలోని నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్, డైరెక్టర్ రూపారెడ్డి హత్యను నిరసిస్తూ ఎల్కతుర్తి మండల కేంద్రంలో శనివారం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు శాంతియుతంగా ర్యాలీ చేపట్టి రూపారెడ్డి మృతికి నివాళులర్పించారు. సందర్భంగా ఎల్కతుర్తి మండల ట్రస్మా అధ్యక్షుడు ఎన్. సుదీర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టే క్రమంలో ఉపాధ్యాయులు సూచనలు, మందలింపులు చేయాల్సి వస్తుందని, వాటిని నేరపూరిత చర్యలుగా పరిగణించకుండా చట్టపరమైన రక్షణ కల్పించాలని కోరారు. ఉపాధ్యాయులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా విధులు నిర్వహించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.విద్యార్థుల ప్రవర్తన, సెల్‌ఫోన్ వినియోగం, నగదు వినియోగం తదితర అంశాలపై తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. పాఠశాల సమయం అనంతరం పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, నైతిక విలువలు, క్రమశిక్షణపై క్రమం తప్పకుండా అవగాహన కల్పించాలని, పాఠశాలల్లో కౌన్సెలింగ్ తరగతులు ఏర్పాటు చేయాలని కోరారు.ఉపాధ్యాయులకు రక్షణ, విద్యార్థులకు క్రమశిక్షణ కల్పించినప్పుడే విద్యా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని సుదీర్ పేర్కొన్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయుల భద్రత అంశంపై తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఒక మెగావాట్ పీఎం - కుసుమ్ సోలార్ ప్లాంట్ ప్రారంభం

**చౌలమద్ది సబ్ స్టేషన్ గ్రిడ్ కు అనుసంధానం**



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, (ప్రజా మంటలు) ఆగస్ట్ 22:** జగిత్యాల జిల్లా ఆరెపేట గ్రామంలో ఒక మెగావాట్ పీఎం - కుసుమ్ సోలార్ ప్లాంట్లు సమీప 33/11 కేవీ సబ్ స్టేషన్ చౌలమద్ది వద్ద జగిత్యాల ఎన్పీడీసీఎల్ ఎస్ఈ బొంకూరి సుదర్శనం గ్రిడ్ కు విజయవంతంగా అనుసంధానం చేసి సాంకేతిక పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఈ సుదర్శనం మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయడానికి పీఎం-కుసుమ్ పథకం ఎంతో లాభదాయకమని, ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పుష్కలమైన అవకాశాలు కల్పిస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో నేటి వరకు అన్నదాతగా ఉన్న రైతన్న విద్యుత్ ప్రదాతగా మారి హరిత ఇంధన ఉత్పత్తిలో భాగస్వామ్యం కావడం సంతోషకరమైన విషయం అని పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాలో మొత్తం 23 దరఖాస్తుదారుల్లో నేటి వరకు మొత్తం ఐదు పీఎం కుసుమ్ సోలార్ ప్రాజెక్టులు గ్రిడ్ కు అనుసంధానం జరిగిందని, వీటి సామర్థ్యం 5 మెగావాట్లు అని చెప్పారు.రెడ్కో జిల్లా మేనేజర్ మనోహర్ మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 95 మంది రైతులు ఈ పథకం కింద నమోదు చేసుకొని 125.9 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఎన్పీడీసీఎల్ సంస్థతో 25 ఏండ్ల కొరకు పీపీఏ అగ్రిమెంట్లు చేసుకున్నారని, వారు ఉత్పత్తి చేసిన ప్రతీ యూనిట్ కు రూ.3.13 చొప్పున డిస్కం చెల్లిస్తుందని తెలిపారు. ఇప్పటివరకు 11 ప్లాంట్లు 15 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాయని పేర్కొన్నారు. ఒక మెగావాట్ సోలార్ ప్లాంట్ నుండి రోజుకు సుమారు 4500 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని, ఏటా 16 లక్షల యూనిట్లకు పైగా జరిగే ఉత్పత్తి పై మొత్తం రూ.56 లక్షల ఆదాయం సమకూరుతుందని, ఒక మెగావాట్ ప్లాంటుకు రూ.3.5 కోట్లు ఖర్చు అవుతుందని, బ్యాంకర్లు 85 శాతం పెట్టుబడి సమకూరుస్తున్నారని, తమ పెట్టుబడి పదేళ్లలో వాపసు వస్తుందని చెప్పారు. అగ్రిమెంట్లు చేసుకున్న రైతులు త్వరితగతిన పనులు పూర్తి చేసి సెప్టెంబర్ నెలాఖరులోపు ఉత్పత్తి ప్రారంభించాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిస్కం డీఈలు మధుసూదన్, గంగారాం, శ్రీనివాస్ గౌడ్, ఏడీఈ లు రవి, శ్రీధర్, జీటి వెంకటేశ్వర్లు, ఏఈలు రమేష్, శ్రీనివాస్, జ్యోతి, ప్లాంట్ యజమాని పుడుకరం నరసింహారెడ్డి, ఏలేటి నరేందర్ రెడ్డి, హర్షిత్ ఇన్ఫ్రా సురేందర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# రాఖీ పండుగపై అపోహలు వీడండి - శివశ్రీ సదానిరంజన్ సిద్ధాంతి

**ఆగస్టు 28న రాఖీ పండుగ:పౌర్ణమి తిథిపై స్పష్టత**





**ఎల్కతుర్తి, ఆగస్టు 22 ప్రజా మంటలు :** రాఖీ పండుగను ఎప్పుడు నిర్వహించాలనే విషయంలో ప్రజల్లో నెలకొన్న అపోహలను వీడాలని వీరశైవ జంగమ ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశ్రీ సదానిరంజన్ సిద్ధాంతి తెలిపారు.ఆగస్టు 27, 28 తేదీల్లో పౌర్ణమి తిథి ఉండటంతో రాఖీ పండుగ నిర్వహణపై సందేహాలు వ్యక్తమవుతున్నాయని ఆయన పేర్కొన్నారు.పౌర్ణమి తిథి ఆగస్టు 27న ఉదయం 9:08 గంటలకు ప్రారంభమై, ఆగస్టు 28న ఉదయం 9:48 గంటలకు ముగుస్తుందని తెలిపారు.శాస్త్రోక్తంగా పౌర్ణమి తిథి ఆధారంగా ఆగస్టు 28న రాఖీ పండుగ నిర్వహించుకోవడం సముచితమని సదానిరంజన్ సిద్ధాంతి వివరించారు. అలాగే ఆగస్టు 28న ఉదయం 6:23 నుంచి 9:48 గంటల వరకు, మధ్యాహ్నం 12:14 నుంచి 1:05 గంటల వరకు రాహు కేతు దోష నివారణకు పూజలు నిర్వహించుకోవచ్చని తెలిపారు.ప్రజలు సామాజిక మాధ్యమాల్లో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మకుండా, శాస్త్రోక్తమైన వివరాలను తెలుసుకుని రాఖీ పండుగను నిర్వహించుకోవాలని ఆయన సూచించారు.

## తనిఖీ చేసిన రికార్డులపై నివేదిక సమర్పించిన సిటిజెన్ రైట్స్ కౌన్సిల్



**గొల్లపల్లి, ఆగస్టు 22 (ప్రజా మంటలు):** జగిత్యాల జిల్లాలోని తుంగూర్, ముత్యంపేట గ్రామపంచాయతీల్లో ఆర్‌టీఐ ఆధారంగా చేపట్టిన రికార్డుల తనిఖీపై సిటిజెన్ రైట్స్ కౌన్సిల్ (సీఆర్‌సీ) రూపొందించిన నివేదికను సంబంధిత అధికారులకు సమర్పించింది.తుంగూర్ (బీరుపూర్ మండలం), ముత్యంపేట (మల్లాపూర్ మండలం) గ్రామపంచాయతీల్లో నిధుల వినియోగం, ఆర్థిక లావాదేవీలు, రికార్డుల నిర్వహణను సీఆర్‌సీ పరిశీలించింది. తుంగూర్‌లో తప్పనిసరిగా నిర్వహించాల్సిన రిజిస్టర్లు అందుబాటులో లేవని, రికార్డులు అస్తవ్యస్తంగా ఉన్నాయని నివేదికలో పేర్కొంది. ముత్యంపేటలో పంచాయతీ ఆస్తుల నిర్వహణ, విక్రయానికి వీడీసీ పేరుతో కమిటీ ఏర్పాటు చేసినట్లు గుర్తించామని తెలిపింది.తుది నివేదికలను 2026 జూలై 21న జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా సీఈవో, జిల్లా డీఏఓ, పంచాయతీరాజ్ కమిషనర్ తదితర అధికారులకు అందజేసినట్లు సీఆర్‌సీ తెలిపింది. నివేదికపై తీసుకున్న చర్యలను వెల్లడించడంతో పాటు, గుర్తించిన లోపాలపై విచారణ జరిపించాలని కోరింది.కార్యక్రమంలో సీఆర్‌సీ సభ్యులు భుక్య చరణ్‌కాంత్, మగ్గిపెల్లి రాజగంగారాం, చుక్క గంగాధర్, టి. చంద్రశేఖర్, కట్టకోలా వివేకానందం, వాలంటీర్లు పాల్గొన్నారు.

# పెన్షనర్ల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి



**జగిత్యాల, ఆగస్టు 22 (ప్రజా మంటలు):** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీజీఈజేఏసీ జగిత్యాల జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా చైర్మన్ మిర్యాల నాగేందర్‌రెడ్డి, కన్వీనర్ కందుకూరి రవిబాబు ఆధ్వర్యంలో శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు.పీఆర్‌సీ అమలు, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏల విడుదల, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణ, పెండింగ్ బిల్లుల చెల్లింపు, హెల్త్ కార్డుల సమర్థవంతమైన అమలు, ఉపాధ్యాయుల బదిలీలు--పదోన్నతులు, జీఓ 25 సవరణ, జీఓ 190 అమలు తదితర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.ఉద్యమ కార్యాచరణ ఆగస్టు 27న రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా నిరసనలు, సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్--మహా ధర్నా నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. జగిత్యాల జిల్లాలో కూడా కార్యక్రమాలను శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


# సామాజిక తత్వవేత్త, రచయిత బి ఎస్ రాములు 78 వ జన్మదినం (23-08-2026) సందర్భంగా ప్రత్యేక వ్యాసం

భారతీయ సామాజిక తత్వవేత్త

- జి. రాములు

(సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు)

ఫోన్: 9490098006



బి.ఎస్. రాములుగారు ఉద్యోగాలు చేశారు, ఉద్యమాలు నడిపారు. ఆ క్రమంలో అరెస్టులయ్యారు, జైలుకు వెళ్లారు, అజ్ఞాత జీవితాన్ని గడిపారు. తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. అనేక అనుభవాల పుట్ట అయిన రాములుగారి గురించి ఎంత రాసినా తక్కువే అవుతుంది. వారి గురించిన కొన్ని ముఖ్యమైన అంశాలను ఇక్కడ చర్చిద్దాం.

బి.యస్. రాములు గారి గురించి నాకు గత 35 సంవత్సరాలుగా తెలుసు. వారి "గతితర్క తత్వదర్శన భూమిక" పుస్తకం 1991లో వెలువడిన కొద్ది కాలంలోనే నేను ఆ పుస్తకాన్ని చదివాను. ఆ అద్భుత గ్రంథం ద్వారానే నేను రాములు గారికి అభిమానిగా మారాను.

### నాపై సి.వి., రాహుల్ సాంకృత్యాయన్ ప్రభావం:

నా ఆలోచనలపై సి.వి. రాసిన "నరబలి", రాహుల్ సాంకృత్యాయన్ రాసిన "మధుర స్వప్నం" బాగా ప్రభావం చూపిన పుస్తకాలు. ఆ తర్వాత లియాంటివ్ రాసిన "అర్థశాస్త్రం", అంబేద్కర్ రాసిన "కుల నిర్మూలన" నాకు బాగా నచ్చిన పుస్తకాలుగా నిలిచాయి. అయితే, బి.ఎస్. గారి తత్వదర్శనం చదివిన తర్వాత నాలో ఒక గొప్ప చలనం కలిగింది. నేను చురుకైన రాజకీయ కార్యకర్తగా సిపిఎంలో విభిన్న హోదాల్లో పని చేస్తూ వస్తున్నాను. అనేక రాజకీయ పాఠశాలలకు టీచర్‌గా వెళ్లి గతితార్కిక, చారిత్రక భౌతికవాదాలపై క్లాసులు చెప్పాను. కానీ, అప్పట్లో అవి రొటీన్‌గా, కేవలం యూరప్ ఉదాహరణలతో మాత్రమే చెప్పేవాడిని.

ఆ తర్వాత వరుసలో బి.ఎస్. గారి "భారతీయ తత్వశాస్త్రం", "గతితర్క తత్వదర్శన భూమిక" మరియు "బౌద్ధం సోషలిజం మార్క్సిజం అంబేద్కరిజం" చేరాయి. బహుశా ఈ క్రమంలోనే బి.ఎస్. రాములుగారిని "ఆధునిక భారతీయ సామాజిక తత్వవేత్త" అని చెప్పడం అతిశయోక్తి కాదనిపించింది. 1998 ఆగస్టులో జరిగిన వారి 50వ జన్మదిన మహోత్సవం సందర్భంగా వెలువరించిన స్వర్ణోత్సవ సంచిక ముఖచిత్రంపై ఆ విధంగా పేర్కొనడం జరిగిందని భావిస్తున్నాను.

నేను 1999లో రాష్ట్ర పార్టీ అవసరాల రీత్యా వరంగల్ నుండి హైదరాబాద్‌కు మారాను. కుటుంబంతో సహా మారాను. అప్పటివరకు వరంగల్‌లో సిపిఎం పార్టీ బాధ్యతల్లో మునిగివుండటం వల్ల బి.ఎస్. రాములు గారిని వ్యక్తిగతంగా కలుసుకునే అవకాశం దొరకలేదు. హైదరాబాద్ వచ్చిన తర్వాతే రాములు గారిని రెగ్యులర్‌గా కలవడం ప్రారంభమైంది. అయితే, మా మధ్య సాన్నిహిత్యం పెరిగి తరచుగా కలుసుకోవడం మాత్రం 2014 తర్వాతే సాధ్యమైంది. వారు అప్పటికే రాష్ట్ర రాజకీయ, సాహిత్య రంగాల్లో ప్రముఖులుగా ఎదిగినప్పటికీ, నా కోసం సమయం కేటాయించి ఎంతో ఆప్యాయంగా మాట్లాడేవారు.

మా పార్టీ "సామాజిక న్యాయం - తెలంగాణ సమగ్రాభివృద్ధి", "ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు", "బీసీ రిజర్వేషన్లు", "లాల్-నీల్ ఐక్యత" నినాదాలతో మార్క్స్, ఫూలే, అంబేద్కర్ల చిత్రపటాలతో సామాజిక న్యాయ యాత్రను చేపట్టింది. తెలంగాణ రాష్ట్రమంతా తిరుగుతున్న ఆ సమయంలో నేను నిరంతరం బి.ఎస్. గారిని కలుస్తూ, పలు సామాజికాంశాలపై చర్చించేవాడిని. వారు సృజించిన తాత్విక సాహిత్యం నాకు, మా పార్టీ శ్రేణులకు ఎంతో ఉపయోగపడింది.

### భారతీయ చారిత్రక భౌతికవాదం - బి.ఎస్. రాములు:

భారతీయ సమాజంలో జరిగిన పరిణామ క్రమం (చారిత్రక భౌతికవాదం) అప్పట్లో మేము బోధించే సిలబస్‌లో ఉండేది కాదు. నాకు అది ఒక పెద్ద లోటుగా అనిపించేది. భారతీయ సమాజానికి డైలెక్టిక్స్ (గతితర్కం) అన్వయిస్తూ, 'భారతీయ చారిత్రక భౌతికవాదం'పై ఒక ప్రత్యేక సిలబస్ తయారు చేయాలని అనుకునేవాళ్లం. కానీ, దానిపై సీరియస్‌గా కృషి చేయలేక సాంప్రదాయ యూరప్ చారిత్రక భౌతికవాదంతోనే కాలం వెళ్లదీసేవాళ్లం. బి.ఎస్. రాములు గారి "గతితర్క తత్వదర్శన భూమిక" గ్రంథం ఆ లోటును పూర్తిగా తీర్చింది. ఆర్థిక, సామాజిక దోపిడీకి గురవుతున్న వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడుతున్న సామాజికోద్యమ కార్యకర్తలకు ఈ పుస్తకం ఒక దిక్సూచిలా ఉపయోగపడింది. అలాగే, 2007లో వారు రాసిన 'భారతీయ చరిత్ర శూద్ర దృక్పథం' అనే గ్రంథం భారతీయ చారిత్రక భౌతికవాదానికి చేకూరిన ఒక గొప్ప బలం.

బుద్ధుడు ప్రపంచంలో మొదటి సోషలిస్టు - బి.ఎస్. రాములు:

బి.ఎస్. రాములుగారు బుద్ధుడి ఆలోచనలను, భావాలను వ్యక్తపరచడాన్ని, కార్యకారణ సంబంధాలను... గతితర్కాన్ని 'ప్రతీత్య సముత్పాదం' అని వివరించారు. కర్మ, పునర్జన్మ, పాప పుణ్యాలు అనేవి బ్రాహ్మణ సృష్టి మాత్రమేనని బుద్ధుడు కొట్టిపారేశారు. అనిత్య, అనాత్మ, నిర్వాణ అనేవి బుద్ధుని అద్భుతమైన తాత్విక ఆలోచనలు. రాములుగారి రచనల్లో ఇవన్నీ వివరంగా చూడవచ్చు. బుద్ధుని ఆలోచనలు 2500 సంవత్సరాల నాడే ఎంత గతితార్కికంగా, విప్లవాత్మకంగా ఉన్నాయో బి.ఎస్. రాములు గారి రచనలు చదివితేనే స్పష్టంగా అర్థమవుతుంది.

సోషలిజం అనే ఆలోచన పాశ్చాత్యుల సృష్టి అని సర్వసాధారణంగా భావిస్తుంటారు. కానీ, బి.ఎస్. రాములు గారు సోషలిజం అనే భావనకు మన దేశంలోనే ప్రాచీన మూలాలు ఉన్నాయని "బౌద్ధం సోషలిజం మార్క్సిజం అంబేద్కరిజం" గ్రంథం ద్వారా లోతైన వివరణలతో, చక్కని ఆధారాలతో నిరూపించారు. అంబేద్కర్ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే భావనలను ఫ్రెంచ్ సోషలిజం నుండి కాకుండా, బుద్ధుని నుండే స్వీకరించానని స్వయంగా చెప్పారు.

బుద్ధుని బోధనల ద్వారా ప్రపంచమంతా ఏ విధంగా ప్రభావితమైందో రాములుగారి పుస్తకాలలో ఆధారాలతో సహా వివరించబడింది. గ్రీకు తత్వవేత్తలైన సోక్రటీస్, ప్లేటో, అరిస్టాటిల్ వంటి వారిని సైతం బౌద్ధం ఏ విధంగా ప్రభావితం చేసిందో వీరి రచనలు తెలుపుతాయి. బౌద్ధం తర్వాతే, ఎన్నో శతాబ్దాలకు క్రైస్తవం, ఇస్లాం మతాలు పుట్టాయి. అలాగే వైదికం కూడా బౌద్ధం నుండి ఎంతో జ్ఞానాన్ని స్వీకరించింది. ఏ ప్రాచీన హిందూ దేవాలయాన్ని చూసినా అవి బౌద్ధ ఆరామాలను తలపిస్తాయి. అక్కడి విగ్రహాలను చూసినా బౌద్ధ నిర్మాణ శైలి (ఆకారం) స్పష్టంగా కనిపిస్తుంది.

బౌద్ధం నుండి స్ఫూర్తి పొంది ఆనాడు ఎన్నో అంతర్జాతీయ విశ్వవిద్యా లయాలు వెలిశాయి. తక్షశిల, నలంద, పాటలీపుత్ర, నాగార్జున, విక్రమశిల వంటి విద్యాలయాల స్థాపన వెనుక ఉన్న ప్రాధాన్యతను రాములుగారి విశ్లేషణల ద్వారా అర్థం చేసుకోవచ్చు. అందులో శిక్షణ పొందిన చరకుడు, శుశ్రుతుడు, వరాహమిహిరుడు, ఆర్యభట్ట తదితరుల పరిశోధనలు ప్రస్తుత సమాజానికి ఎంతగా ఉపయోగపడుతున్నాయో రాములుగారు ఆధారాలతో సహా సేకరించి అందించడం విశేషం.

"రాజనీతి భావాలకు, ఆలోచనలకు, తత్వశాస్త్రానికి మూలం గ్రీకు, ప్రాచీన పశ్చిమ దేశాలేనని చాలామంది అనుకోవడం చారిత్రక పరిజ్ఞానం లేకపోవడమే ప్రధాన కారణం. రాజకీయ చింతనకు సంబంధించి లోతుగా వెళ్లి పరిశోధించక పోవడమే దీనికి మూలం" అంటూ - "ఇప్పటి వరకు కూడా పాఠ్యపుస్తకాల్లో చదువుకున్న దాని ప్రకారం సామ్యవాదమంటే పాశ్చాత్య భావన అని మన మెదడుల్లో ముద్రించబడింది" అంటారు రాములుగారు. ఈ అపోహను తొలగించుకోవాలంటే తప్పకుండా రాములు గారి "బౌద్ధం సోషలిజం మార్క్సిజం అంబేద్కరిజం" పుస్తకం చదవాలి.

బౌద్ధం తాత్విక పునాదిగా సోషలిస్టు మేనిఫెస్టోను కలిగి ఉందని రాములు గారి విశ్లేషణ చాలా ఆసక్తికరంగా ఉంటుంది. "మానవులు ప్రయత్న పూర్వకంగా నిర్మించిన ఆదిమ సోషలిస్టు సమాజాల్లో ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపింది బౌద్ధ సమాజమే. యూరప్ తత్వశాస్త్రాలకు పుట్టినిల్లైన గ్రీసు దేశానికి, భారతదేశానికి పూర్వకాలం నుంచే సంబంధాలు ఉండేవి. బుద్ధుని కాలం నాటికి గ్రీకు తత్వశాస్త్రం ఇంకా ప్రాథమిక స్థాయిలోనే ఉంది. స్వతంత్రంగా ఎదిగిన బౌద్ధ ప్రభావం గ్రీకు తత్వవేత్తలపై ఎంతగానో పడింది. "సోక్రటీస్, ప్లేటో, అరిస్టాటిల్ కాలం నాటికే ఇక్కడ బౌద్ధం ఒక బలమైన సామాజిక వ్యవస్థగా వేళ్లూనుకుంది" అని వివరించిన తీరు అద్భుతంగా ఉంది. బుద్ధుణ్ణి, బౌద్ధాన్ని అర్థం చేసుకోవడంలో భారతీయ శాస్త్రవేత్తలు ఎంత వెనుకబడ్డారో అనేక ఉదాహరణలతో వివరించారు. అంతేకాదు, క్రైస్తవం, ఇస్లాం మతాలకు బౌద్ధం తల్లి లాంటిదని, వైదికం కూడా బౌద్ధం నుండి ఎంతో జ్ఞానాన్ని స్వీకరించిందని వారు వివరించారు.

(తరువాయి రేపటి సంచికలో)

## మంత్రి కొండా సురేఖపై వేటుకు రంగం సిద్ధం

**కుమార్తె వ్యాఖ్యల వివాదమే ప్రధాన కారణం . సురేఖను తప్పించాలని పలువురు**

**కాంగ్రెస్ ఎమ్మెల్యేల డిమాండ్ . సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన నుంచి వచ్చాక తుది నిర్ణయం**



తెలంగాణ మంత్రి కొండా సురేఖపై వేటు వేసేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం సిద్ధమైనట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఆమె కుమార్తె చేసిన వ్యాఖ్యల వివాదం, పార్టీలో అంతర్గత విభేదాల నేపథ్యంలో సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలని నిర్ణయించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాత ఈ మేరకు అధికారిక ప్రక్రియ ప్రారంభం కానుంది.కొండా సురేఖ కుమార్తె సుస్మిత ఇటీవల సీఎం రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డిని అహంకారిగా అభివర్ణిస్తూ, తెలంగాణ కాంగ్రెస్‌ను 'తెలుగుదేశం కాంగ్రెస్'గా మార్చేశారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సురేఖకు షోకాజ్ నోటీసు ఇవ్వగా, తన కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగతమని, వాటితో తనకు సంబంధం లేదని ఆమె బదులిచ్చారు. అయితే, కుమార్తె వ్యాఖ్యలను ఖండించకపోవడం, సీఎం పాల్గొన్న కార్యక్రమాలకు గైర్హాజరు కావడం వివాదాన్ని మరింత తీవ్రతరం చేసింది.ఈ పరిణామాల మధ్య, ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లాలకు చెందిన సుమారు 20 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శుక్రవారం సమావేశమయ్యారు. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి, పార్టీ నుంచి తక్షణమే తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ విప్ బీర్ల ఇలయ్య, ఎమ్మెల్యే వేముల వీరేశం వంటి నేతలు మాట్లాడుతూ.. పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించే అంతర్గత విమర్శలపై కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే సురేఖపై చర్యలకు ఉపక్రమించినట్లు సమాచారం. ఈ నిర్ణయాన్ని అధిష్ఠానం ఇప్పటికే సీఎంకు తెలియజేసింది. సీఎం తిరిగి రాగానే గవర్నర్‌కు సిఫార్సు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం లండన్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం తిరిగి రానున్నారు. ఆయన వచ్చాక తుది నిర్ణయం తీసుకుంటారు.

## తెలంగాణ విద్యార్థులంటే లెక్కలేదా.. రాహుల్ గాంధీపై కేటీఆర్, కవిత ఫైర్

**విద్యార్థులపై పోలీసుల చర్యలపై రాహుల్ మౌనాన్ని ప్రశ్నించిన కేటీఆర్, కవిత**

**ఢిల్లీలో ధర్నా చేసి, తెలంగాణ ఘటనలపై స్పందించకపోవడం ద్వంద్వ వైఖరి అని విమర్శ**

**మహబూబాబాద్‌లో విద్యార్థుల గొంతు పట్టుకున్న పోలీసుల వీడియోపై ఆగ్రహం**

**రేవంత్ రెడ్డి ఇంటి వద్ద రాహుల్ ధర్నా చేయగలరా అని కేటీఆర్ నిలదీత**



తెలంగాణలో విద్యార్థులపై పోలీసుల చర్యల విషయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మౌనం వహించడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఢిల్లీలో విద్యార్థుల కోసం ధర్నా చేసిన రాహుల్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రమైన తెలంగాణలో జరుగుతున్న దాడులపై స్పందించకపోవడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని వారు ఆరోపించారు.శుక్రవారం కేటీఆర్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ రాహుల్ గాంధీ తీరును తప్పుబట్టారు. "దేశంలో రెండు రకాల భారతాలు ఉన్నాయి. ఒకచోట విద్యార్థులపై లాఠీఛార్జ్ జరిగితే రాహుల్ గాంధీ ప్రశ్నిస్తారు, ధర్నాలు చేస్తారు. కానీ, కాంగ్రెస్ పాలనలో ఉన్న తెలంగాణలో విద్యార్థులను ఈడ్చుకెళ్తూ, గొంతు పట్టుకొని హింసిస్తున్నా పట్టించుకోరు. ఢిల్లీ తరహాలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటి ముందు రాహుల్ గాంధీ ధర్నా చేస్తారా లేక తెలంగాణ విద్యార్థులంటే మీకు లెక్కలేదా" అని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు.ఇదే అంశంపై ఎమ్మెల్సీ కవిత కూడా స్పందిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టు 19న మహబూబాబాద్‌లో పాలిటెక్నిక్ విద్యార్థి గొంతును ఓ పోలీస్ ఇన్‌స్పెక్టర్ పట్టుకున్న వీడియోను ప్రస్తావిస్తూ ఆమె విమర్శలు గుప్పించారు. "ఢిల్లీ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎఫ్ఐఆర్ కోసం వెళ్లిన రాహుల్, తెలంగాణ ఘటనలపై ఎందుకు మౌనం వహిస్తున్నారు ఇక్కడి విద్యార్థులను నేరస్థుల్లా చూస్తున్నారు. ఢిల్లీకి మీ ఆవేశం, తెలంగాణకు మీ మౌనం.. విద్యార్థులు మీ నుంచి ఇంతకంటే మెరుగైన తీరును ఆశిస్తున్నారు" అని కవిత అన్నారు.

# హైదరాబాద్‌లో భారీ పన్ను ఎగవేత గుట్టురట్టు

హైదరాబాద్‌లో భారీ జీఎస్టీ ఎగవేత గుట్టును హైదరాబాద్ సెంట్రల్ జీఎస్టీ (సీజీఎస్టీ) అధికారులు రట్టు చేశారు. నగర శివార్లలోని ఒక రేకుల షెడ్డులో రహస్యంగా నిర్వహిస్తున్న పాన్ మసాలా, పొగాకు తయారీ యూనిట్‌పై దాడి చేసి, సుమారు రూ. 160 కోట్ల మేర పన్ను ఎగవేతను గుర్తించారు. ఈ అక్రమ దందాను నిర్వహిస్తున్న కీలక వ్యక్తిని అధికారులు అరెస్ట్ చేశారు.అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ యూనిట్‌లో ఎటువంటి అనుమతులు లేకుండానే పాన్ మసాలా, సుగంధ జర్దా వంటి ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. తనిఖీల సమయంలో లెక్కల్లో చూపని 40 ప్యాకింగ్ యంత్రాలను అధికారులు కనుగొన్నారు. ఈ ఫ్యాక్టరీలో మొత్తం 56 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇక్కడ తయారైన సరుకును జీఎస్టీ, హెచ్ఎస్ఎన్ఎస్ సెస్, సెంట్రల్ ఎక్సైజ్ సుంకాలు చెల్లించకుండానే మార్కెట్‌కు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది.దాడుల్లో భాగంగా రవాణాకు సిద్ధంగా ఉన్న రూ. 76 లక్షల విలువైన సరుకుతో పాటు, 5,500 కిలోల రెడీమేడ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు 2,015 కిలోల పాన్ మసాలా మిశ్రమం, 810 కిలోల పొగాకు, ప్యాకింగ్ మెటీరియల్‌తో పాటు అక్రమ రవాణాకు ఉపయోగిస్తున్న రెండు వాహనాలను సీజ్ చేశారు.పాన్ మసాలా, పొగాకు ఉత్పత్తులపై 2026 ఫిబ్రవరి నుంచి అమల్లోకి వచ్చిన కొత్త పన్ను నిబంధనల నుంచి తప్పించుకోవడానికే ఇటువంటి అక్రమాలకు పాల్పడుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు. పట్టుబడిన స్టాక్, యంత్రాల సామర్థ్యం, పనిచేస్తున్న కార్మికుల సంఖ్య ఆధారంగా మొత్తం పన్ను ఎగవేత రూ. 160 కోట్లుగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ రాకెట్‌లో ప్రధాన సూత్రధారిని



అరెస్ట్ చేయగా, ప్రత్యేక ఆర్థిక నేరాల కోర్టు అతనికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.

## నైరుతి పవనాల్లో తీవ్ర అసమానతలు ఏపీలో 40 శాతం వర్షపాతం లోటు



దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు బలహీనంగా కొనసాగుతున్నాయి. ఆగస్టు 21 నాటికి దేశంలో వర్షపాతం 13 శాతం లోటుతో నమోదైంది. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించిన గణాంకాల ప్రకారం, జూన్ 4 నుంచి ఇప్పటివరకు దీర్ఘకాలిక సగటు 619 మిల్లీమీటర్లకు గాను కేవలం 537.6 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే కురిసింది. అయితే, ఈ జాతీయ సగటుకు, క్షేత్రస్థాయి వాస్తవాలకు మధ్య తీవ్ర వ్యత్యాసం కనిపిస్తోంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయి.పలు రాష్ట్రాలు భారీ వర్షపాతం లోటుతో సతమతమవుతున్నాయి. హరియాణాలో 45 శాతం, బిహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 40 శాతం చొప్పున వర్షపాతం తక్కువగా నమోదైంది. పంజాబ్‌లో 32 శాతం, కర్ణాటకలో 25 శాతం లోటు కొనసాగుతోంది. దీనికి పూర్తి విరుద్ధంగా, ఒడిశాలో 25 శాతం అధిక వర్షపాతం నమోదు కాగా, జమ్మూకశ్మీర్‌లో 6 శాతం అధికంగా వర్షాలు కురిశాయి. వాతావరణ వ్యవస్థలు పదేపదే మధ్య, తూర్పు భారతదేశంలో కేంద్రీకృతం కావడంతో ఉత్తర, వాయవ్య, దక్షిణ ప్రాంతాలు పొడిగా మిగిలిపోతున్నాయి.జూన్‌లో బలహీనంగా ప్రారంభమైన రుతుపవనాలు, జులైలో కాస్త మెరుగుపడినా, ఆగస్టులో లోటు మళ్లీ 11 నుంచి 13 శాతం వద్ద స్థిరపడింది. ప్రభుత్వం గుర్తించిన 262 వర్షాభావ ప్రభావిత జిల్లాల్లో దాదాపు సగం జిల్లాల్లో ఇప్పటికీ లోటు వర్షపాతమే నమోదవుతోంది. ఇది వర్షాధార వ్యవసాయంపై తీవ్ర ఆందోళనలకు కారణమవుతోంది.రానున్న రోజుల్లో మధ్య, తూర్పు, ఉత్తర భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో మరోసారి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. అయినప్పటికీ, ఇలా అడపాదడపా కురిసే భారీ వర్షాలు.. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న వర్షాభావాన్ని పూర్తిగా భర్తీ చేయలేవని స్పష్టం చేస్తున్నారు. రుతుపవనాల చివరి దశలోనూ ఈ ప్రాంతీయ అసమానతలు కొనసాగే అవకాశం ఉందని అంచనా.

## చిన్నారెడ్డిని సస్పెండ్ చేయండి ఖర్గేకు ఎమ్మెల్యే మేఘారెడ్డి ఫిర్యాదు



తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయి. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, సీనియర్ నేత జి.చిన్నారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వనపర్తి ఎమ్మెల్యే టి. మేఘారెడ్డి నేరుగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఫిర్యాదు చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న చిన్నారెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.శుక్రవారం న్యూఢిల్లీలో తన మద్దతుదారులతో కలిసి ఖర్గేను కలిసిన మేఘారెడ్డి.. చిన్నారెడ్డి పార్టీకి నష్టం కలిగించేలా మాట్లాడుతున్నారని వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తమ ఫిర్యాదుపై ఖర్గే సానుకూలంగా స్పందించారని, నివేదిక ఇవ్వాలని తన కార్యాలయాన్ని ఆదేశించినట్లు తెలిపారు. ఇప్పటికే టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి అన్ని ఆధారాలు ఇచ్చామని, ఆ కమిటీ చిన్నారెడ్డికి షోకాజ్ నోటీసు జారీ చేసిందని వివరించారు.ఇటీవల వనపర్తి జిల్లా గోపాల్‌పేటలో జరిగిన ఓ కార్యక్రమంలో చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ వివాదానికి కారణమయ్యాయి. 2023 ఎన్నికల్లో డబ్బు కారణంగానే తనకు టికెట్ రాలేదని, అధిష్ఠానం, సీఎం రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. పార్టీలో ఉన్నా భరించలేకపోతున్నామని, మరో జీవన్‌రెడ్డిలా తిరుగుబాటు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన పార్టీ క్రమశిక్షణ కమిటీ ఆయనకు నోటీసులు పంపింది.ఈ పరిణామాల నేపథ్యంలో చిన్నారెడ్డిని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తొలగించేందుకు అధిష్ఠానం నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. మంత్రి కొండా సురేఖతో పాటు ఆయనపైనా చర్యలు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి ఆగస్టు 23న విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చాక దీనిపై అధికారిక ఉత్తర్వులు వెలువడొచ్చని తెలుస్తోంది.మరోవైపు, చిన్నారెడ్డికి జారీ చేసిన షోకాజ్ నోటీసును వెనక్కి తీసుకోవాలని ఆయన మద్దతుదారులు గాంధీ భవన్ వద్ద నిరసనకు దిగారు. 48 ఏళ్లుగా పార్టీకి సేవ చేస్తున్న చిన్నారెడ్డి క్రమశిక్షణ తప్పలేదని, వనపర్తిలో నిజమైన కార్యకర్తలకు జరుగుతున్న అన్యాయంపైనే ఆయన మాట్లాడారని వాదించారు. ఈ పరిణామాలతో తెలంగాణ కాంగ్రెస్‌లో తలెత్తిన ఈ సంక్షోభంపై అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న ఆసక్తి నెలకొంది.

## మంత్రులు, ఎంపీలతో జనసేన కమిటీ స్థానిక ఎన్నికలే లక్ష్యం

**స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన ప్రత్యేక దృష్టి . 14 మంది సభ్యులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు**

**ఎన్నికల వ్యూహాలు, మార్గదర్శకాల రూపకల్పన బాధ్యత . కమిటీలో మంత్రి దుర్గేష్, ఎంపీ బాలశౌరికి చోటు**



రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను జనసేన పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. ఈ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, మార్గదర్శకాలను రూపొం దించేందుకు పార్టీ అధినేత పవన్ కల్యాణ్ 14 మంది సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ మేరకు శుక్రవారం అమరావతి నుంచి ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు.ఈ కమిటీలో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఎంపీ వల్లభనేని బాలశౌరి వంటి కీలక నేతలకు చోటు కల్పించారు. వీరితో పాటు ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, దేవ వరప్రసాద్, సి. హెచ్. వంశీకృష్ణ యాదవ్, లోకం మాధవి, పాట్సమట్ల ధర్మరాజు సభ్యులుగా నియమితులయ్యారు.వీరితో పాటు ఎంఎస్ఎంఈ చైర్మన్ టి. శివశంకర్, చిలకం మధుసూదన్ రెడ్డి, కోటికలపూడి గోవిందరావు, సామినేని ఉదయభాను, యనమల భాస్కర్, కోరికాన రవికుమార్‌లను కమిటీలో సభ్యులుగా నియమించారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం, అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాల ఖరారు వంటి కీలక బాధ్యతలను ఈ కమిటీ పర్యవేక్షించనుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com